
సాక్షి విశాఖపట్నం

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

దొండపర్తిలో 54 అడుగుల వినాయకుడు



వినాయక ప్రతిమతో మహిళ



వన్‌టౌన్ ప్రాంతం నుంచి ఉత్సవాలకు తీసుకువెళుతున్న గణేషుడు



జై బోలో గణేష్ మహరాజ్‌కి...



పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పూర్ణామార్కెట్

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటు నేనయ్య.. అంటూ విఘ్నరాజు ఉత్సవాలకు నగరం ముస్తాబైంది. సర్వ విఘ్నాలను తొలగించే వినాయకుడు.. తొలి పూజ అందుకోడానికి తాత్కాలిక మండపాలు, పందిళ్లలో కొలువుదీరుతున్నాడు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు విశాఖ సిద్ధమైంది. ప్రతి వీధిలోను సినిమా సెట్లను తలదన్నేలా మండపాలు సిద్ధమయ్యాయి. – విశాఖ సిటీ



పూజా సామగ్రి కొనుగోలు చేస్తూ..

న్యూస్‌రీల్

గణేష్ మండపాలను పరిశీలించిన సీపీ



గణేష్ మండపం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న సీపీ తదితరులు

ఎంవీపీకాలనీ: వినాయక చవితి వేడుకలు పురస్కరించుకొని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి విస్తృతంగా పర్యటించారు. పలు కీలకప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాలను, విగ్రహాలను పరిశీలించారు. భద్రతను స్వయంగా పర్యవేక్షించి మండప కమిటీలకు పలు సూచనలు చేశారు. మండపాలు వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని, క్యూలైన్లు ఏర్పాటు, అగ్నిమాపక శకటాలు అందుబాటులో ఉంచుకోవాలని, పార్కింగ్ ప్రదేశాలనుఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనాలు జరిగే అప్పుఘర్, జోడుగుళ్లపాలెం సముద్రతీరాలను కూడా సీపీ పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అందరూ సుఖ సంతోషాలతో వర్థిల్లాలి : మేయర్



డాబాగార్డెన్స్: నగర ప్రజలకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, విశాఖ మహా నగరం సస్యశ్యామలంగా, విశాఖ నగర ప్రజలు సుఖ సంతోషాలతో వర్థిల్లాలేందుకు విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ కలగాని ఆకాంక్షించారు. విశాఖ నగరాన్ని కలుషితం కాకుండా పర్యావరణ హితమైన మట్టి గణపతి ప్రతిమలతో వినాయక చవితి జరుపుకోవాలని కోరారు.


రేపు సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీనృసింహ హోమాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే హోమంలో రూ.2500 టికెట్టు తీసుకుని ఉభయదాతలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈసేవలో భక్తులు ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కానీ టికెట్టు తీసుకొని పాల్గొనవచ్చన్నారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో టికెట్లు లభిస్తాయని తెలిపారు. అలాగే www.aptemples.ap.gov.in టికెట్లు తీసుకోవచ్చని తెలిపారు.

అప్పన్న ఉద్యోగి సస్పెన్షన్

సింహాచలం : మద్యం సేవించి విధులకు హాజరైన సింహాచలం దేవస్థానం ఉద్యోగిని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సస్పెండ్ చేశారు. సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బలిరెడ్డి సన్యాసిరావు విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సన్యాసిరావు మద్యం సేవించి విధులకు హాజరై భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఫిర్యాదు రావడంతో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌ను విచారణకు ఆదేశించారు. ఆనంద్‌కుమార్ విచారణ జరిపి మద్యం తాగి వచ్చింది వాస్తవమేనని నివేదిక ఇవ్వడంతో సన్యాసిరావును సస్పెండ్ చేశారు.

85 శాతం మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలు పొందిన అభ్యర్థులతో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే

విశాఖ సిటీ: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారీటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) సంయుక్తంగా నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణను పూర్తి చేసుకున్న వారికి చెన్నై, హైదరాబాద్‌లలో ప్రముఖ సంస్థలలో ఉద్యోగాలు లభించాయి. వారికి పోర్టు పరిపాలనా భవనంలోని మంథన్ మందిరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే నియామక పత్రాలు అందజేశారు. ఇప్పటికే తొలి మూడు బ్యాచ్‌లకు ఉద్యోగావకాశాలు లభించగా.. 4, 5 బ్యాచ్‌లలో సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ కోర్సులలో 50 మందికి శిక్షణ ఇవ్వగా 85 శాతం మందికి ఉపాధి లభించింది. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోర్టు దూకుడు

విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) అద్భుతమైన పనితీరుతో దేశంలోని ఇతర పోర్టులకు సవాల్ విసురుతోంది. సరకు రవాణా రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతూ.. కొత్త కొత్త రికార్డులను సృష్టిస్తోంది. గతేడాది 35 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను రవాణా చేయడానికి 163 రోజులు పట్టగా.. ఈ ఏడాది కేవలం 149 రోజుల్లోనే ఈ లక్ష్యాన్ని చేరుకుని అదరహో అనిపించింది. ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను రవాణా చేయాలనే లక్ష్యంతో పరుగు తీస్తోంది. ఇందులో భాగంగానే సరకు రవాణాను మరింత సమర్థంగా నిర్వహించడానికి ఆధునిక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోంది. మరోవైపు భారీ నౌకలను సైతం సులువుగా బెర్తింగ్ చేసేలా బెర్తులను ఆధునీకీకరిస్తోంది. – సాక్షి, విశాఖపట్నం

- వరుస రికార్డులతో విశాఖ పోర్టు సత్తా
- మాంగనీసు హ్యాండ్లింగ్ దేశవ్యాప్త రికార్డు
- రికార్డు స్థాయిలో 6,290 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి
- 149 రోజుల్లోనే 35 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్

దేశంలోని మేజర్ పోర్టుల వరుసలో ప్రస్తుతం విశాఖపట్నం పోర్టు అథారిటీది నాలుగో స్థానం. వచ్చే మూడేళ్లలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు నంబర్‌వన్ పోర్టుగా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీలు, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టులపై ప్రధాన దృష్టిసారించారు. వివిధ జెట్టీల ద్వారా మాంగనీస్, బొగ్గు, జిప్సం, బాక్సైట్ తదితర ఖనిజాలు, ఇతర ప్రధాన ఉత్పత్తులు రవాణా జరుగుతుంటుంది. భవిష్యత్‌లో వీటి రవాణా సామర్థ్యం పెరిగే అవకాశం ఉన్నందున జెట్టీల విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఆర్అండ్‌డీ యార్డులో వ్యక్తిగత క్యాబిన్‌ల నిర్మాణం, ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ ద్వారా యార్డును రైల్వే ప్రమాణాలకు అనుగుణంగా పునరుద్ధరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాగా సరకు రవాణాలో ఆధునిక వ్యూహాలను అనుసరిస్తూ కార్గో హ్యాండ్లింగ్‌లో పోర్టు దూసుకెళ్తోంది.

రైస్ బ్యాగ్‌ల ఎగుమతి



2024-25 ఆర్థిక సంవత్సరంలో సరకు హ్యాండ్లింగ్ రికార్డులిలా..

- 45 రోజుల్లో 10 మిలియన్ మెట్రిక్ టన్నులు
- 83 రోజుల్లో 20 మిలియన్ మెట్రిక్ టన్నులు
- 126 రోజుల్లో 30 మిలియన్ మెట్రిక్ టన్నులు
- 149 రోజుల్లో 35 మిలియన్ మెట్రిక్ టన్నులు
- ఈ ఏడాది లక్ష్యం : 90 మిలియన్ మెట్రిక్ టన్నులు

కొత్త రికార్డుల జోరు

సరకు ఎగుమతి, దిగుమతుల్లో విశాఖపట్నం పోర్టు అథారిటీ సరికొత్త ఒరవడి సృష్టిస్తోంది. 90 ఏళ్ల పోర్టు చరిత్రలో వ్యాపార భాగస్వాముల సౌజన్యంతో కొత్త రికార్డులను నెలకొల్పింది. ఇటీవల కాలంలో పోర్టు అధిగమించిన రికార్డులివీ..

- గత నెల 4న ఎంవీ అమిస్ విజ్డమ్–2 కార్గో షిప్ ద్వారా 6,290 మెట్రిక్ టన్నుల బియ్యం బస్తాలను ఎగుమతి చేశారు. గతేడాది మార్చి 15న సాధించిన 5,511 మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించింది.
- గత నెల ఒకటో తేదీన ఎంటీ ఈగల్ వ్యాలరీ క్రూడాయిల్ షిప్ ద్వారా హెచ్‌పీసీఎల్‌కు చెందిన 1,60,000 మెట్రిక్ టన్నుల క్రూడాయిల్ హ్యాండ్లింగ్ జరిగింది. ఈ ఏడాది మే 26న సాధించిన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును తిరగరాసింది.
- జూలై 7న 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌తో ఎంవీ హువాయిన్ న్యూ కాసిల్ మార్క్స్ లైన్ కార్గో షిప్ వైజాగ్ చేరుకుంది. దేశంలో ఒక పోర్టుకు ఒకే నౌక ద్వారా తీసుకువచ్చిన అతి పెద్ద సరకు ఇదే కావడం విశేషం. ఇందులో 1,24,500 మెట్రిక్ టన్నులను విశాఖపట్నం పోర్టులో అన్ లోడింగ్ చేశారు.
- పోర్టు అనుబంధ వీసీటీపీఎల్‌లో మేలో 68,812 టీఈయూల రవాణా జరిగింది. గతేడాది ఆగస్టులో సాధించిన 67,636 టీఈయూల రికార్డును అధిగమించింది.
- తూర్పు తీరంలో ఏ పోర్టుకూ సాధ్యం కానీ భారీ కంటైనర్ షిప్‌లను హ్యాండ్లింగ్ చేసింది. 15,264 టీఈయూ(20 అడుగుల కంటైనర్లు)తో 366 మీటర్ల పొడవైన ఎంఎస్‌సీ మోనికా క్రిష్టినా కంటైనర్ కార్గో వెసెల్(యూరప్)ను బెర్తింగ్ చేసి రికార్డు సృష్టించింది.
- గత నెలలో 48 నౌకల ద్వారా 22,35,891 మెట్రిక్ టన్నుల కోల్, కోక్‌ను పోర్టు దిగుమతి చేసుకుంది. 2002 జూలైలో 21,39,771 మెట్రిక్ టన్నుల కోల్ కోక్ దిగుమతులే అప్పటివరకు అత్యధికం.
- గత నెలలో ఐదు నౌకల ద్వారా 3,08,213 మెట్రిక్ టన్నుల లైమ్‌స్టోన్‌ను దిగుమతి చేశారు. 2022 మే న సాధించిన 213,170 మెట్రిక్ టన్నుల లైమ్‌స్టోన్ రికార్డును అధిగమించింది.
- మేలో ఐదు నౌకల ద్వారా 5,04,815 మెట్రిక్ టన్నుల బాక్సైట్ దిగుమతి అయింది. గత 2024 మార్చిలో 2,64,630 మెట్రిక్ టన్నుల బాక్సైట్ దిగుమతులే అప్పటివరకు రికార్డుగా ఉండేది.

మాంగనీస్ హ్యాండ్లింగ్




నంబర్ వన్.. మా లక్ష్యం



సరకు హ్యాండ్లింగ్ చురుగ్గా నిర్వహించేందుకు అత్యాధునిక పద్ధతులకు శ్రీకారం చుట్టాం. ఇందులో భాగంగా నేషనల్ టెక్నాలజీ సెంటర్ ఫర్ పోర్ట్స్ వాటర్‌వేస్ అండ్ కోస్ట్స్ (ఎన్‌టీసీపీడబ్ల్యూసీ)తో రూ.14.03 కోట్లతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. సరకు రవాణాలో అత్యాధునిక వెసెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అనేది అత్యంత కీలకమైన అంశం. కార్గోని వీలైనంత త్వరగా ఎగుమతి దిగుమతులు చేసేందుకు ఈ మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఉపయోగపడుతుంది. ఇలా భిన్నమైన వ్యవస్థలతో వీపీఏను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. బెర్తుల యాంత్రీకరణ, ఆధునికీకరణ పనులు వేగవంతం చేశాం.

– డా.అంగముత్తు, వీపీఏ చైర్మన్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా జాన్‌వెస్లీ



జాన్ వెస్లీ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా బొల్లవరపు జాన్ వెస్లీని నియమించారు. శుక్రవారం ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

డెంగ్యూ బాధితుల ఇళ్లకు డీఎంహెచ్‌వో

మహారాణిపేట: డెంగ్యూ బారిన పడి చికిత్స పొందుతున్న వారి గృహాలను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అప్పుఘర్ ఫిషర్‌మెన్ కాలనీ, అప్పుఘర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇద్దరికి డెంగ్యూ సోకింది. వారి ఇళ్లకు డీఎంహెచ్‌వో వెళ్లి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఇళ్ల చుట్టుపక్కల యాంటీ లార్వా ఆపరేషన్లు జరిగాయో లేదో తెలుసుకుని, డెంగ్యూపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడే ప్రాముఖ్యాన్ని తెలుపుతూ ఆ ప్రాంతంలో లార్వా అధికంగా ఉండటాన్ని గమనించి, సత్వర చర్యలు తీసుకోవాలని ఏఎంహెచ్‌వోను ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఏఎంవోహెచ్, మలేరియా సిబ్బందితో సమన్వయం చేసుకుని తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా శాఖ సిబ్బంది ఐఈసీ(ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) కార్యక్రమాలను నిర్వహించాలని డీఎంహెచ్‌వో సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆక్టివ్ సర్వేలెన్స్ ఆఫ్ మలేరియా, డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్ తదితర వాటిపై హెల్త్ సెక్రటరీ, ఆశా కార్యకర్త, మలేరియా, శానిటేషన్ సిబ్బందికి డీఎంహెచ్‌వో పలు సూచనలిచ్చారు.

9 నుంచి యూసీ క్రికెట్ లీగ్



ట్రోఫీ ఆవిష్కరిస్తున్న జాన్‌వెస్లీ

విశాఖ స్పోర్ట్స్ : యునైటెడ్ ఇన్ క్రిస్టియన్ క్రికెట్ లీగ్ ఈనెల 9నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. డాక్టర్ వైఎస్సార్ స్టేడియం–బీ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సెయింట్‌పాల్ చర్చ్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రోఫీని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగ చైర్మన్ జాన్‌వెస్లీ ఆవిష్కరించారు. వండర్ కిడ్ మాస్టర్ నేతన్ ఐజాక్ టోర్నీ సిల్వర్ కాయిన్, లోగోను విడుదల చేశారు. టోర్నీ నిర్వాహకుడు సునీల్ ఐజాక్ మాట్లాడుతూ క్రిస్టియన్ సంఘాల క్రికెట్ జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ మాథ్యూ పీటర్, రమేష్ జాన్సన్, సన్నీజోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో రాజీపడొద్దు



మాట్లాడుతున్న హరేందిర ప్రసాద్

మహారాణిపేట: మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. నాణ్యత, రుచిలో రాజీపడొద్దని సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. మధ్యాహ్నం భోజనం మెనూ మార్పులు చేశామన్నారు. ఈ మార్పులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ కోరారు. అక్షయ పాత్ర సంస్థ వంట చేసే విషయంలో జాగ్రత్తలు పాటించాలని, అదే విధంగా కుక్–కం–హెల్పర్ కూడా వంట పాత్రలు, వంట చేసే పరిసరాలు శుభ్రంగా ఉండేటట్లు చుసుకోవాలన్నారు. గుడ్డు, రాగి జావ తయారీలో అయ్యే గ్యాస్ ఖర్చుల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి కుక్‌కం హెల్పర్లు తెచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డీఈవో ఎల్.చంద్రకళ, అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.అరుణజ్యోతి, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, పాఠశాల మేనేజ్‌మెంటు కమిటీలు పాల్గొన్నాయి.

పోలీసులకు వైద్య పరీక్షలు



స్టెతస్కోప్‌తో పరీక్షిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బందికి కేజీహెచ్‌లో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో తొలిరోజు 57 మంది సిబ్బందికి కేజీహెచ్ వైద్యులు పరీక్షించి చికిత్స, మందులు అందించారు. వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ నెల 9, 10 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసులకు వైద్య పరీక్షలు చేయడానికి అంగీకరించిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను అభినందించారు. పోలీసు కుటుంబ సభ్యులందరూ ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే పోలీస్ శాఖలో కొందరు హోంగార్డులు మద్యానికి బానిసగా ఉండడం గుర్తించామని, దానికి డీ–అడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స అందజేస్తామని తెలిపారు. సీపీ శంఖబ్రత బాగ్చి సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు స్టెతస్కోప్‌తో పరీక్షలు నిర్వహించారు.

ఇద్దరు అనధికార ఏజెంట్ల అరెస్ట్

- విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం
- బాధితుల ఫిర్యాదుతో కేసుల నమోదు

విశాఖ సిటీ: విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఇద్దరు అనధికార ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఖతార్‌లో ఫిట్టర్ ఉద్యోగాల పేరుతో గాజువాకలోని గోల్డ్ యాపిక్ ఇన్‌స్టిట్యూట్‌లో 'గ్లోబల్ హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ'నిర్వాహకుడు డొంకాడ నరేష్‌కుమార్ పలు దఫాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించాడు. ఈ ఏడాది మే 10న నిర్వహించిన ఇంటర్వ్యూకు చినగంట్యాడ ప్రాంతానికి చెందిన నారం చిన్నారావు హాజరయ్యాడు. ఖతార్‌లో ఫిట్టర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు నరేష్‌కుమార్ చెప్పాడు. చిన్నారావు పాస్‌పోర్ట్‌ను తీసుకున్నాడు. ఆగస్టులో పోస్టింగ్ ఇచ్చే సమయంలో డబ్బు చెల్లించాలని చెప్పాడు. కానీ నరేష్‌కుమార్ ఉద్యోగం కల్పించకపోగా.. పాస్‌పోర్టు తిరిగి ఇవ్వలేదు. దీంతో చిన్నారావు ఈ నెల 4న గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఏజెంట్ నరేష్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మరో కేసులో ప్రైవేట్ ఏజెంట్ కరణం బాబూరావు మయన్మార్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి గాజువాకకు చెందిన మాడగల రమేష్ కుమార్ నుంచి 2022, సెప్టెంబర్ 22న రూ.90 వేలు వసూలు చేశాడు. అతడి మాటలు నమ్మి మయన్మార్ వెళ్లిన రమేష్‌కుమార్ అక్కడ సైబర్ గ్యాంగ్ చేతిలో చిక్కాడు. వారు కొన్ని సెల్‌ఫోన్ నంబర్లు ఇచ్చి వారి నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేయించేవారు. కొద్ది రోజులకు రమేష్‌కుమార్ భయపడి ఆ గ్యాంగ్ నుంచి తప్పించుకున్నాడు. అక్కడ రాయబార కార్యాలయానికి నివేదిక ఇచ్చి విశాఖకు తిరిగి వచ్చేశాడు. తను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఏజెంట్ బాబూరావును అడగగా అతడు ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ వచ్చాడు. దీంతో రమేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ప్రైవేట్ ఏజెంట్ బాబూరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గం

గాజువాక: ఉమ్మడి విశాఖ జిల్లాల గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర సంఘం నుంచి ఎన్నికల పరిశీలకులుగా హాజరైన పి.ఉగ్రసేన, బి.రామభద్రరాజు, కె.రామకృష్ణ సమక్షంలో గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వి.ఆనందరావు (యలమంచిలి), ప్రధాన కార్యదర్శిగా వి.అజయ్ కుమార్ (మల్కాపురం), ఉపాధ్యక్షురాలిగా పి.దమయంతి (నర్సీపట్నం), సహాయ అధ్యక్షుడిగా వై.వెంకటేశ్వర్లు (మాడుగుల), సహాయ కార్యదర్శిగా బి.సూర్యకళ (పెందుర్తి), ప్రచార కార్యదర్శిగా ఎల్.రాజేంద్రవర్మ (డీసీఎల్), కోశాధికారిగా కె.శ్రీనివాసరావు (తుమ్మపాల), రాష్ట్ర ప్రతినిధిగా ఎల్‌వీ రమణ, కార్యవర్గ సభ్యులుగా ఎన్‌వీనర్సింహం (అడవివరం), బీవీఎస్.అప్పారావు (పద్మనాభం), ఎం.సత్యవతి (పాడేరు), బి.చంద్రకళ (గాజువాక), బి.కనకరాజు (గాం. దీగ్రాం), జి.పైడిరాజు (జెడ్‌జీఎస్) తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యకవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుందని కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ గ్రంథాలయాల ప్రతినిధులు ఆర్.కన్నబాబు, ఓ.శ్రీనివాసరావు, వి.మోహన, ఆర్ సీహెచ్.వెంకటరావు, పద్మావతి దేవి, పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జై బోలో గణేష్ మహరాజ్‌కి..

- నగరంలో వినాయక చవితి సందడి
- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- గాజువాక, మల్కాపురం, దొండపర్తిలో 'మహా' గణపయ్యలు

విశాఖ సిటీ: వినాయక చతుర్థి పూజా సామగ్రి విక్రయాలతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. ఆదిదేవుడు, విఘ్నాలు తొలగించే వినాయక చవితిని ధనిక, పేద భేదం లేకుండా ప్రతి ఒక్కరూ చేసుకునే పండగ కావడంతో మార్కెట్లు, ప్రధాన కూడళ్లు వినాయక విగ్రహాలు, పత్రి పూజా సామగ్రి వ్యాపారులు, కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

కళకళలాడిన మార్కెట్లు

నగరంలో మార్కెట్లు జనాలతో కిక్కిరిసిపోయాయి. పూర్ణామార్కెట్, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, అక్కయ్యపాలెం, కంచరపాలెం, గోపాలపట్నం, గాజువాక, ఇలా అన్ని ప్రాంతాల్లో కొనుగోలుదారులతో రహదారులు కళకళలాడాయి.

ఆకాశాన్నంటిన ధరలు : వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. పువ్వులు, పండ్ల ధరలు పెరిగాయి. చిన్న సైజు మట్టి గణపతి ప్రతిమలు నుంచి పెద్ద సైజ్ వరకూ ధరలు విపరీతంగా పెంచేశారు. ఒకవైపు మట్టి విగ్రహాలను స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేస్తున్నా.. వ్యాపారులు మాత్రం ధర తగ్గింపులో రాజీ పడలేదు. అలాగే చిన్న కొబ్బరికాయ రూ.30, దేశవాలీ అరటి పండ్లు డజను రూ.100, పాలవెల్లి రూ.30, పత్రి రూ.30 నుంచి రూ.50, యాపిల్స్ రూ.100కు నాలుగు.. ఇలా అన్నింటి ధరలు భారీగా ఉన్నాయి. పూజకు అవసరమయ్యే అన్ని పండ్లు, సామగ్రి కొనుగోలుకు ప్రాంతాన్ని బట్టి కనిష్ఠంగా రూ.1000 నుంచి రూ.1500 ఖర్చు చేయాల్సి వచ్చింది.

నగరంలో విభిన్న గణనాథులు


చవితి పర్వదినం సందర్భంగా జిల్లాలో పలు చోట్ల వినూత్నంగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. గాజువాక, ఎంవీపీ కాలనీ, దొండపర్తి ప్రాంతాల్లో భారీ గణనాథులను ప్రతిష్ఠిస్తున్నారు. 80 అడుగుల నుంచి 50 అడుగుల మేర విగ్రహాలను ఏర్పాటు చేశారు. భారీ విగ్రహాలతో పాటు కొందరు నిర్వాహకులు చాక్లెట్ వినాయకుడు, బెల్లంతో చేసిన విగ్రహాలు కొలువుదీరనున్నాయి.

నిమజ్జన సమయంలో జాగ్రత్తలు

- ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయకూడదు.
- విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో రంగులు చల్లడం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం, మందుగుండు సామగ్రిని పేల్చడం చేయకూడదు.
- పోలీసుల అనుమతి లేకుండా వేషధారణలు, ఎక్కువ శబ్దం వచ్చే వాయిద్యాలు(డీజే) వాడకూడదు.
- నిమజ్జన ఊరేగింపునకు అనుమతించిన సమయం, కేటాయించిన ప్రదేశం, మార్గం వంటి నిబంధనలు పాటించాలి.
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా అర్జీదారుడు, కార్యనిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఇక్కడే నిమజ్జనాలు..

- వన్ టౌన్ పరిధిలో విగ్రహ ప్రతిష్ఠ చేసిన వారు నేవల్ కోస్టల్ బ్యాటరీ క్వార్టర్స్‌కు ఎదురుగా నిమజ్జనం చేయాలి.
- న్యూ పోర్ట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నవారు యారాడ ఫిషింగ్ జెట్టీ వద్ద..
- ఆరిలోవ పరిధిలోని వారు రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం వద్ద..
- ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో జాలారిపేట వద్ద.
- దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో రావుల చెరువు, అప్పికొండ బీచ్‌లో..
- భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో భీమిలి బీచ్‌లో. తగరపువలస వద్ద గోస్తని నదిలో, చిల్లపేట ట్యాంక్, మంగమారిపేట బీచ్, అన్నవరం బీచ్‌లో.
- పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పినగాడి చెరువు, సరిపల్లి వద్ద శివాలయం చెరువు, రాంపురం ట్యాంక్ వద్ద నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేశారు.



గాజువాకలోని శ్రీనగర్‌లో ఏర్పాటు చేసిన 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి విగ్రహం



మల్కాపురం ప్రాంతంలో తుది మెరుగులు దిద్దుకుంటున్న బెల్లం వినాయకుడు

భారీ బెల్లం వినాయకుడు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో తొలిసారిగా భారీ వినాయకుడు పూజలకు సిద్ధమయ్యాడు. ఇప్పటి వరకు నగరం, గాజువాక ప్రాంతంలోనే భారీ వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు కాగా.. ఈ ఏడాది పారిశ్రామిక ప్రాంతంలో కూడా ఏర్పాటు చేస్తుండటంతో భక్తుల్లో ఆసక్తి నెలకొంది. జీవీఎంసీ 59వ వార్డు పరిధి నక్కవానిపాలెం వద్ద ఉన్న సర్దార్ నెస్ట్‌కు చెందిన సుమారు ఎకరం స్థలంలో లంబోదరాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 అడుగుల భారీ విగ్రహం రూపుదిద్దుకుంది. అన్నట్లు బెల్లంతో ఈ వినాయకుడి విగ్రహం తయారు చేయడం మరో విశేషం. లంబోదరాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 అడుగుల భారీ వినాయకుడి విగ్రహం రూపొందించడానికి రెండు నెలల పాటు కళాకారులు అహర్నిశలు శ్రమించారు. ముందుగా కర్రలు, మట్టి, వెదుర్లు, ఇతర సామగ్రితో విగ్రహానికి రూపం ఇచ్చారు. మరోవైపు రాజస్థాన్ నుంచి రూ.8లక్షల విలువైన 20 టన్నుల బెల్లం దిమ్మలను తెప్పించారు. 75 అడుగుల ఎత్తు వరకు ఈ బెల్లాన్ని ఒక్కొక్కటిగా అమర్చారు. రూ.16 లక్షలతో సెట్ వేశారు. శనివారం ఉదయం 9 గంటలకు తొలి పూజతో భారీ వినాయకుడికి ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని.. సాయంత్రం నుంచి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తామని ట్రస్ట్ చైర్మన్ మొల్లి శ్రీను యాదవ్, అధ్యక్షుడు మొల్లి గోవర్ధన్ తెలిపారు

చవితికి సంపత్ వినాయకుడు ముస్తాబు

- నేటి నుంచి 15వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు



సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవస్థానంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఇక్కడ వినాయక చవితి పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం నుంచి 15 వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేదుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త టి.ఎస్.రాజేశ్వరన్, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు టి.ఆర్.చోళన్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈవో కె.శిరీష ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా వినాయకుడిని తొమ్మిది రోజుల పాటు తొమ్మిది అవతరాల్లో ముస్తాబు చేస్తారు. రోజూ గణపతి హోమం, నాదస్వర కచేరీ, ప్రత్యేక అభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నారాయణ సేవ, ఆధ్యాత్మిక ప్రసంగాలు, హారతి, ప్రసాద వితరణ ఉంటాయి.

సేవల వివరాలివీ.. : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు రకాల సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. శాశ్వత అభిషేక సేవకు రూ.5 వేలు, అభిషేకానికి రూ.2,500, ప్రసాద సేవలో భాగంగా చక్కెర పొంగలి/ కేసరి, తీపి ఉండ్రాళ్ల కోసం రూ.1800, పులిహోరా, శనగలు, ఉండ్రాళ్ల నిమిత్తం రూ.వెయ్యి విరాళాలు స్వీకరిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 6.30 గంటల వరకు భజనలు, కోలాటం, కూచిపూడి నృత్యాలు, భక్తి గీతాలాపన, గణపతి భక్తి గీతాలు, సంగీత కచేరీ, శ్రీ లలిత సహస్ర నామం సామూహిక పారాయణం, వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఉపాధి కూలీకి తీవ్ర గాయాలు

పరవాడ: క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తానాంలోని కంసాలి చెరువు గట్టు సమీపంలో మొక్కలకు కంచె వేస్తున్న ఉపాధి కూలీ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషయంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలివీ.. తానాం గ్రామానికి చెందిన 58 ఏళ్ల చీపురుపల్లి అప్పారావు శుక్రవారం కంసాలి చెరువు గట్టు వద్ద మొక్కలకు కంచె వేస్తున్నాడు. అప్పర్ సీలేరు నుంచి పెందుర్తి వైపు కంసాలి చెరువు మీదుగా 220 కేవీ విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. కంచెకు ఉపయోగిస్తున్న పచ్చి ముళ్ల కంపలు విద్యుత్ తీగలకు తగలడంతో అప్పారావు షాక్‌కు గురయ్యాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అప్పటికే 80 శాతం వరకు కాలిపోయిన అప్పారావును నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషయంగా ఉన్నట్లు వైద్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కేవలం 10 అడుగుల ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా.. ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛందంగా నేత్రదానం చేయండి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాఖ సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో నేత్రదాన ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యశాల నుంచి సత్యం జంక్షన్, అక్కడ నుంచి రామాటాకీస్ కూడలి వరకు ర్యాలీ జరిగింది. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్ర దానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్జీవోలు, వైద్య విద్యార్థులు, సిబ్బంది సహకారంతో నేత్ర దాన పక్షోత్సవాలు విజయవంతమయ్యాయని చెప్పారు.సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్ర వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ నవీన్‌కుమార్, హెడ్ నర్స్ రాజేశ్వరి, పీఎంవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, శంకర్ ఫౌండేషన్, గీతం మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్నపాత నేరస్తుడి అరెస్ట్



మల్లారెడ్డి వెంకటేష్

అక్కిరెడ్డిపాలెం: తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని గాజువాక పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. క్రైం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపిన వివరాలివీ.. గాజువాక శ్రీనగర్‌లో నివాసం ఉంటున్న బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగి కె.వెంకట చలపతిరావు గత నెల 2న హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంటికి వెళ్లాడు. ఈ నెల ఒకటో తేదీన వారి ఇంటి పొరుగున ఉన్న వారు చలపతిరావు ఇంటి ముందు గేటు తెరిచి ఉండటాన్ని గమనించి వెంటనే ఆయనకు సమాచారం అందించారు. దీంతో చలపతిరావు ఈ నెల 3 హైదరాబాద్ నుంచి శ్రీనినగర్ చేరుకున్నారు. ఇంటికి వచ్చి చూసేసరికి మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపల వెతికారు. బీరువా తలుపులు కూడా పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ. 20 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. బాధితుడు చలపతిరావు జరిగిన దొంగతనంపై 4న గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటువంటి చోరీలు నగరంతో పాటు గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల జరుగుతుండటంతో క్రైం డీసీపీ కె.లతా మాధురి పర్యవేక్షణలో జోన్-2, క్రైం ఇన్‌చార్జి ఏసీపీ ఎ.వెంకటరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్పెషల్ టీంను ఏర్పాటు చేశారు. దర్యాప్తులో ఈ చోరీకి పాల్పడింది పాతనేరస్తుడు మల్లారెడ్డి వెంకటేష్‌గా గుర్తించారు. పక్కా సమాచారంతో ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి గాజువాక సుందరయ్య కాలనీలో అతన్ని అరెస్ట్ చేశారు. దీంతో పాటు మరో మూడు చోరీలకు సంబంధించి వెండి గొలుసు, వెండి ఉంగరం, రూ.5వేల నగదు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.67 వేలు రికవరీ చేశారు. వెంకటేష్ చదువు మానేసి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. స్నేహితులతో కలిసి ఈజీ మని సంపాదించాలనే ఉద్దేశంతో ఈ విధమైన చోరీలకు పాల్పడుతున్నాడని సీఐ తెలిపారు. అతనిపై ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్లలో 31 కేసులు నమోదై ఉన్నాయి.

ప్రత్యేక రైళ్లకు అదనపు హాల్ట్‌లు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లకు శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్‌లలో అదనపు హాల్ట్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి (06089) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- సంత్రగచ్చి (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తాంబరం-సంత్రగచ్చి(06095) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-తాంబరం(06096) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లకు ఆయా రోజుల్లో శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్‌లలో ఇరు వైపులా హాల్ట్ కల్పించారు. ఈ స్టేషన్‌లలో రెండేసి నిమిషాలు ఈ రైళ్లు ఆగుతాయి.

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈ మార్గంలో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా విశాఖ చేరుకున్నాయి. ఉదయం రావలసిన గోదావరి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.3గంటలకు, ఉదయం 6.50గంటలకు చేరుకోవలసిన మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లు సాయంత్రం 6 గంటల తరువాత చేరుకున్నాయి. దీంతో విశాఖ నుంచి బయల్దేరాల్సిన విశాఖ-మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్‌ను 5 గంటలు, విశాఖ-అమృతసర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, విశాఖ- సికింద్రాబాద్(12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ 3గంటలకు పైగా రీ షెడ్యూల్ చేశారు.

యశ్వంత్‌పూర్ వరకు హౌరా -సత్యసాయి ప్రశాంతి నిలయం స్పెషల్ రైలు

హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం-హౌరా మధ్య స్పెషల్ రైళ్లు యశ్వంత్‌పూర్ వరకు పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రతి బుధవారం హౌరాలో బయలుదేరే హౌరా-శ్రీ సత్యసాయిప్రశాంతి నిలయం (22831) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి యశ్వంత్‌పూర్ వరకు నడుస్తుంది. ఈ రైలు గురువారం రాత్రి 9.30గంటలకు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంనకు చేరుకుని, అక్కడ నుంచి 9.32గంటలకు బయల్దేరి మధ్యరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ వెళ్తుంది. ప్రతి శుక్రవారం శ్రీ సత్యసాయిప్రశాంతి నిలయంలో బయలుదేరాల్సిన శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం-హౌరా (22832) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి యశ్వంత్‌పూర్‌లో బయలుదేరుతుంది. యశ్వంత్‌పూర్‌లో ప్రతి శుక్రవారం ఉదయం 5గంటలకు బయలుదేరి ఉదయం 7.40 గంటలకు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంనకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.42 గంటలకు బయలుదేరి శనివారం మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా వెళ్తుంది.

డాక్టర్ రమాదేవికి 'సరోజా వైద్యనాథన్' పురస్కారం



కూచిపూడి నాట్య నిపుణురాలు రమాదేవి

మద్దిలపాలెం: ప్రముఖ కూచిపూడి నర్తకీమణి, నాట్య పరిశోధకురాలు, ప్రయోక్త, రచయిత్రి డాక్టర్ పి.రమాదేవి పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ పురస్కారం-2024కు ఎంపికయ్యారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్ఎండీఏ) సంచాలకుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఎన్ఎండీఏ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో కళాభారతి ఆడిటోరియంలో అఖిలభారత శాస్త్రీయ నృత్యోత్సవం, వైశాఖీ నృత్యోత్సవం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజుల పాటు దేశ విదేశాలకు చెందిన శాస్త్రీయ నృత్య కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా రమాదేవిని సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ పురస్కారంతో సత్కరించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నంది టీవీ ఫిల్మ్ జ్యూరీ సభ్యురాలిగా పనిచేశారు. 27 నృత్య నాటకాలకు దర్శకత్వం వహించి, ఏడు నృత్య నాటకాలను రచించారు.

వరద బాధితులకు ఫార్మాసిటీ రూ.10 లక్షల విరాళం

పరవాడ: అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.హరిప్రకాష్ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి విశాఖ ఫార్మాసిటీ రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర విపత్తు నివారణ సంస్థకు పంపించినట్లు ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి తెలిపారు. వరదల వల్ల జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని.. బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయంగా రూ.10 లక్షలు అందించినట్లు ఆయన చెప్పారు. వరద బాధితులను ఆదుకోవడానికి ఫార్మాసిటీ ఉద్యోగులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

జ్ఞానజ్యోతికి గురుకుల బాలికల ఎంపిక



గురుకుల బాలికలకు పుస్తకాలు అందజేస్తున్న సీవో రూపావతి, నవోదయ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

మధురవాడ: ప్రతిభావంతులైన బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రవేశపెట్టిన 'జ్ఞాన జ్యోతి'కి కొమ్మాది రిక్షాకాలనీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల సీవోఈకి చెందిన 10 మంది ఎంపికయ్యారు. ఎంపీసీ, బైపీసీ నుంచి చెరో ఐదుగురు ఈ పథకానికి ఎంపికవ్వగా.. ఒక్కొక్కరికీ రూ.10 వేలు విలువైన సైన్స్, ఇతర పుస్తకాలను శుక్రవారం గురుకులాల డీసీవో ఎస్.రూపావతి అందజేశారు. విజ్ఞానజ్యోతి నాలెడ్జ్ సెంటర్‌గా పనిచేస్తున్న నవోదయ విద్యాలయ సమితి బాలికలను దత్తత తీసుకుని.. ఐఐటీ, నీట్, ఎంసెట్ తదితర కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహిస్తుంది. ఎంపికైన బాలికలకు రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలతో పాటు ఏడాదికి రూ.12వేల స్కాలర్‌షిప్ అందజేస్తారు. నవోదయ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.చంద్రశేఖర్, గురుకుల ప్రిన్సిపాల్ టి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'ఫెర్రో స్క్రాప్ ప్రైవేటీకరణ అంగీకరించబోం'

ఉక్కునగరం: ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ సంస్థ ప్రైవేటీకరణ అంగీకరింబోమని ఫెర్రో స్క్రాప్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. ఫెర్రోస్క్రాప్ వైజాగ్ యూనిట్‌లో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 3న బిలాయ్‌లో జరిగిన సమావేశం వివరాలను వెల్లడించారు. ఉద్యోగుల వైద్య సదుపాయలు మెరుగు పర్చాలని, ప్యానల్ డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఉద్యోగులకు గ్రాట్యూటీ రూ.20 లక్షలు, యూనిఫాంలు, సేఫ్టీ బూట్లు, నైట్ షిఫ్ట్ ఎలవెన్స్ రూ.180 చెల్లించాలని కోరినట్లు చెప్పారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎం.అమ్మిరెడ్డి, పి.రాములు, ఎస్.ఎస్.నాయుడు, కె.గోపాలరెడ్డి, రెడ్డి రాంబాబు, రామకృష్ణ, ఎస్.కె.సింగ్ పాల్గొన్నారు.

కబ్జాలు తొలగించి ప్రభుత్వ ఆస్తులు కాపాడండి

డాబాగార్డెన్స్: ప్రకృతిని కాపాడకుంటే విజయవాడలో వచ్చిన వరదల వంటి ఉపద్రవాలు ఎదురు కావచ్చని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ హెచ్చరించారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల గెడ్డలు, చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఫలితంగా ప్రకృతి విలయానికి గురికావాల్సి వస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన హైడ్రా తరహాలో ఏపీలో కూడా ఆక్రమణలు తొలగించాలని కోరారు. సమావేశంలో ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.